
ప్రజాశక్తి
బుధవారం 24 జనవరి 2024
5
పార్వతీపురం మన్యం



నేడు కలెక్టరేట్ వద్ద యజ్ఞం : యుటిఎఫ్

ప్రజాశక్తి -కలెక్టరేట్ వద్ద

ఉపాధ్యాయులు, ఉద్యోగులకు 30శాతం ఐఆర్ (మధ్యంతర భృతి) ఇవ్వాలని, రూ.18వేల కోట్లు ఆర్థిక బకాయిలు చెల్లించాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బుధవారం సాయంత్రం యజ్ఞం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు తెలిపారు. పిఆర్‌సి కోసం కమిటి వేసి 6నెలలు కావస్తున్నా దానికి అతీగతిలేదని, కావున వెంటనే మధ్యంతర భృతి 30శాతం ఇవ్వాలని, ఉద్యోగులు దాచుకున్న డబ్బును వెంటనే చెల్లించాలని కోరుతూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



మొక్కు తీర్చుకుంటున్న మహిళ

సిరిమానోత్సవంలో పాల్గొన్న జనం

పోలమాంబ ఉత్సవ విగ్రహం

పట్టువస్త్రాలు సమర్పిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

- వైభవంగా సిరిమానోత్సవం
- లక్షలాదిగా తరలివచ్చిన యాత్రికులు
- గంటన్నర ఆలస్యంగా సిరిమాను ఊరేగింపు
- పట్టు వస్త్రాలు సమర్పించిన డిప్యూటీ సిఎం రాజన్నదొర

జన శంబరం

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర గిరిజన దేవతగా గుర్తింపు పొందిన శంబర పోలమాంబ అమ్మవారి తొలి జాతర వైభవంగా జరిగింది. మంగళవారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో సిరిమాను ఊరేగింపు చేపట్టింది. ఈ సందర్భంగా అమ్మవారిని సుమారు లక్షన్నరకు పైగా భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆర్‌డిఒ కె.హేమలత సమన్వయంతో, అడిషనల్ ఎస్పీ సునీల్ సోరెన్ పర్యవేక్షణలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడు గంటల ప్రాంతంలో సిరిమానును అధిరోహించాల్సిన పూజారిని చదురు గుడి నుంచి తీసుకెళ్లేందుకు గ్రామ పెద్దలు గుడి వద్దకు రావడంతో పోలీసులు ఎక్కువ మందిని అనుమతించక పోవడంతో స్వల్ప వివాదం జరిగింది. దీంతో సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై నరసింహమూర్తి వివాదాన్ని సద్దుమణిగింప చేసి కార్యక్రమానికి మార్గం సుగుమం చేశారు. దీంతో సుమారు గంటన్నర ఆలస్యంగా పూజారి జన్ని జగదీష్ సిరిమాను అధిరోహించాల్సి వచ్చింది. ఎప్పటి మాదిరిగానే సావిడి వీధి నుంచి బయలుదేరిన సిరిమానుతో అమ్మవారు కేరళ వారి ఇంటి వద్ద పూజలు అందుకొని అనంతరం కరణం వారి ఇంటి వద్ద నుండి నేరుగా ఎస్సీ వీధి, పనుకు వీధి, గొల్ల వీధుల నుంచి మళ్లీ సావిడి ప్రధాన వీధికి చేరుకుని సిరిమానోత్సవం ముగింపు చేశారు

సజావుగా ప్రయాణాలు

జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. దీంతో చెముడు వైపు వెళ్లే వాహనాలు ఇటు కవిరిపల్లి వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూశారు. గతం కంటే ఈ ఏడాది ఎక్కడా ట్రాఫిక్ సమస్య తలెత్తలేదు.

ముమ్మరంగా ఆలయ తనిఖీలు

జాతరకు వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పరిమితికి మించి వాహనాల్లో భక్తులను ఎక్కించకుండా నడపాలని ఆర్‌టిఒ మల్లికార్జున రెడ్డి తమ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు వ్యక్తిగత, ప్రైవేట్ వాహహనాల్లో ప్రయాణించే వాహన చోదకులు వారు డ్రంక్ అండ్ డ్రైవ్, త్రిబుల్ రైడింగ్ లు చేయకుండా పర్యవేక్షించారు. జాతర సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అవగాహన కల్పిస్తూ పరిమితులు లేని వాహనాలుకు కేసులు కట్టడం ఫ్రంట్ సీటు సిట్టింగ్ కూడా లేకుండా చేసి భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రమాదాలు జరగకుండా ముందుగా డ్రైవ్ నిర్వహించడం జరిగింది. స్పెషల్ డ్రైవ్‌లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సాలూరు జేవీఎస్ ప్రసాద్, జి సత్యనారాయణ, రమేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

అందరికీ ధన్యవాదాలు


పోలమాంబ జాతర సజావుగా ప్రశాంతంగా జరిగినందుకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు దేవాదాయశాఖ ఇఒ వివి సూర్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు. జిల్లాస్థాయిలో అన్ని శాఖల అధికారుల నుంచి మండల సచివాలయ అధికారులకు, పారిశుధ్య కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఘటాన్ని తీసుకెళ్తున్న టిడిపి నాయకులు సంధ్యారాణి

రాష్ట్ర జాతరగా..

రాష్ట్ర జాతరగా అవతరించిన పోలమాంబ అమ్మవారికి ప్రభుత్వం తరపున రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర పట్టు వస్త్రాలు సమర్పించారు. అంతకుముందు రాజన్నదొరకు పూర్ణకుంభంతో పూలమాల వేసే దేవాదాయశాఖ అధికారులు స్వాగతం పలికారు. మేళతాళాల నడుమ డిప్యూటీ సిఎం రాజన్నదొర అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమ్మక్క, సారక్క జాతర తరువాత రాష్ట్ర జాతరగా తొలిసారి అవకాశం లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తొలిసారి అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనందంగా ఉందన్నారు.



గోముఖి నది వద్ద, వంతెనపై యాత్రికుల రద్దీ



సిబ్బందికి సూచనలిస్తున్న ఎఎస్‌పి సునీల్ సోరెన్



క్యూలైన్లలో యాత్రికులు



సాలూరులో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

చర్చలు సఫలం

తెరుచుకున్న అంగన్వాడీ కేంద్రాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన జిల్లాలో 42 రోజుల పాటు అంగన్‌వాడీలు నిర్విరామంగా వివిధ రూపాల్లో చేపట్టిన నిరవధిక సమ్మె మంగళ వారంతో ముగిసింది. అలుపెరగకుండా నిరవధిక సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీలకు సిఐటియు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అభినందనలు తెలిపింది. 42 రోజుల పాటు ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ నిరసన కొనసాగి, రాష్ట్ర చరిత్రలోనేనీ పోరాటం నిలిచింది. సిఎం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలనే నినాదంతో కొనసాగిన ఈ సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు, ఎస్మా, ఇలా అనేక పద్ధతులను ఉపయోగించింది. ఐసిడిఎస్ అధికారులను, పోలీసులను ఉసిగొల్పింది. ఆఖరుకు ఉద్యోగాల నుండి తొలగింపు వరకు తీసుకొచ్చింది. అయినా అంగన్‌వాడీలు అదరక బెదరక పోరాటాన్ని కొనసాగించారు. ఈ పోరానికి ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. అంగన్వాడీల అమరావతి ముట్టడిని చూసిన ప్రభుత్వం సోమ వారం రాత్రి హుటాహుటిన యూనియన్ నాయకులతో జరిపిన చర్చలు సఫలం కావడంతో మంగళ వారం నుంచి సమ్మె విరమించి, అంగన్వాడీలంతా తమ తమ కేంద్రాలకు వెళ్లి విధుల్లో పాల్గొన్నారు.



పార్వతీపురం : నర్సిపురంలో విధుల్లోకి చేరిన అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల విజయోత్సవ ర్యాలీ

సాలూరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 42రోజుల పాటు సమ్మె చేసిన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు మంగళవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన కార్యకర్తలు, హెల్పర్లు డిమాండ్ల పరిష్కారం కోసం అనేక ఒత్తిళ్లను ఎదుర్కొని పోరాడి విజయం సాధించిన నేపథ్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి బోసుబొమ్మ జంక్షన్ ర్యాలీ చేపట్టారు. అనంతరం బోసుబొమ్మ జంక్షన్‌లో కేక్ కట్ చేసిన యూనియన్ నాయకులు నారాయణమ్మ, శశికళ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు కార్యకర్తలకు పంపిణీ చేశారు. పోరాటంలో కడదాకా నిలబడిన అంగన్వాడీ కార్యకర్తలు. హెల్పర్లందరికీ ధన్యవాదాలని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుమారి, జానకీ, శాంతి, తిరుపతమ్మ, ఉత్తరమ్మ, మరియమ్మ, సుజాత, చిలకమ్మ, రాధ, ఈశ్వరమ్మ, పద్మ పాల్గొన్నారు.

సీతంపేట : అలుపెరగకుండా నిరవధిక సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీతంపేట ప్రాజెక్ట్ కమిటీ ధన్యవాదాలు తెలిపింది. అభినందనలు తెలిపిన వారిలో సిఐటియు జిల్లా కమిటీ సీనియర్ నాయకులు ఎ.భాస్కరరావు, మండల అధ్యక్ష కార్యదర్శి ఎస్.సురేష్, ఎం.కాంతారావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీతంపేట ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు బి.పార్వతి, ఎ.దర్శిమి, తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ బంటు దాసు

26న రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే

ట్రాక్టర్, బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఈనెల 26న సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు రైతు సంఘం, కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగే ట్రాక్టర్ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ బంటు దాసు పిలుపునిచ్చారు. మంగళ వారం స్థానిక బైపాస్ రోడ్డు కాలనీలో ఉన్న రైతు కూలీ సంఘం కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహణపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి బంటు దాసు మాట్లాడుతూ ఆలిండియా ఎస్‌కెఎం పిలుపు మేరకు ఈనెల 26న వివిధ రైతు, కార్మిక సంఘాలు కలిసి స్థానిక ఎఎంసి నుండి సుందరయ్య భవనం వరకు ట్రాక్టర్లు, బైకులు, ఆటోలతో ర్యాలీ నిర్వహించి మన రైతు, కార్మికుల ఆకాంక్షలకు అనుగుణంగా పంటలన్నింటికీ గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, రైతులందరికీ రుణమాఫీ చేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లను పెట్టరాదని, తక్షణం అమలులోకి వచ్చిన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని, ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉపాధి హామీ బడ్జెట్‌ను రూ.రెండు లక్షలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఢిల్లీలో రైతు ఉద్యమంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, ఈ సమస్యలన్నింటినీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించేలా ప్రయత్నించాలని డిమాండ్ చేశారు. అంతవరకు కార్మిక, కర్షక ఐక్య పోరాటాలు చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే ఈనెల 26న ఉదయం 11 గంటలకు మార్కెట్ యార్డుకు చేరుకోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అప్పలనాయుడు, టి.జీవ, సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, గిరిజన సంఘం సహాయ కార్యదర్శి కె.రామస్వామి, ఎపి రైతు కూలీ సంఘం సహాయ కార్యదర్శి ఎం.భాస్కరరావు, ఎస్.విశ్వేశ్వరరావు, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇవి నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు గరుగుబిల్లి సూరయ్య, జనసేన నాయకులు బోను చంటి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సెస్ వసూలు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ, ప్రైవేట్ భవన నిర్మాణ యజమానుల నుంచి సెస్‌ను విధిగా వసూలు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. మంగళ వారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భవన, ఇతర నిర్మాణాల కార్మికుల సంక్షేమ సెస్ వసూలుపై సంబంధిత అధికారులతో జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణాలు చేపట్టే యజమానులు మార్కెట్ విలువ ప్రకారం ఒక్క శాతం సెస్‌ను విధిగా చెల్లించాలని స్పష్టం చేశారు. కార్మికశాఖకు ఆన్లైన్ ద్వారా గానీ, చలానా రూపంలో గానీ చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. కార్మికశాఖ అధికారులు ఈ విషయాన్ని భవన నిర్మాణాలు ప్రారంభించే సమయంలోనే యజమానులకు అవగాహనా కల్పించి సెస్‌ను వసూలు చేయాలని సూచించారు. వసూలు చేసిన సెస్‌ను కార్మిక సంక్షేమ బోర్డుకు జమ చేయాలని జేసీ కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పరంగా పంచాయతీ రాజ్ శాఖ, పురపాలక సంఘాలు, పారిశ్రామికశాఖ, జిల్లా పరిషత్ తదితర శాఖలు ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలు చేసిన సెస్ వివరాలను జాయింట్ కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా శాఖల నేతృత్వంలో జరుగుతున్న పనుల వివరాలను వారం రోజుల్లో సమర్పించాలని ఆయన ఆదేశించారు. ఇన్‌ఛార్జి కార్మికశాఖ జిల్లా అధికారి ఎల్.సుబ్రమణ్యం మాట్లాడుతూ పనులు చేస్తున్న శాఖలు ప్రతి నెలా కార్మిక శాఖకు నివేదికలు అందజేయాలన్నారు. 2014 జూన్ 2 నుంచి శాఖలు నివేదికలు అందజేయాలని తద్వారా వాటి సమన్వీకరణ చేయడం జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ కె.రామకృష్ణారావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జివివి సత్యనారాయణ, పే అండ్ అకౌంట్స్ అధికారి పి.చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ జిల్లా అధికారి ఓ.ప్రభాకరరావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారి ఎస్.వేణుగోపాలరావు, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవి కరుణాకర్, జిల్లా గనుల శాఖ అధికారి కె శ్రీనివాస రావు, జిల్లా ఖజానా అధికారి ఎ.మన్మథరావు, పార్వతీపురం, సాలూరు మున్సిపల్ కమిషనర్లు జె.రామ అప్పలనాయుడు, జయరాం, జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి ఎల్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జన విజ్ఞాన వేదిక, పీపుల్స్ హెల్త్ సోసైటీ ఆధ్వర్యంలో 'ప్రాథమిక చికిత్స'పై గిరిజన సామాజిక భవనంలో రెండు రోజులుగా నిర్వహించిన అవగాహన శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ శిక్షణా తరగతుల్లో కురుపాం, గుమ్మలక్ష్మీ పురం, సాలూరు, పార్వతీపురం, కొమరాడ, సీతంపేట మండాలాలకు చెందిన 30మంది గిరిజన యువతీయువకులు పాల్గొన్నారు. వీరికి జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు సుజాత, యోహాను, ప్రాణిగ్రాహీలు శిక్షణ అందించారు. పాముకాటు, వడ దెబ్బ, విద్యుత్ షాక్, చెట్టు పై నుండి కింద పడినా, జ్వరాలు, చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఎటువంటి ప్రాథమిక చికిత్స అందించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ఇంజక్షన్ వేయడం నేర్పించారు. గుండె ఆగిన సమయంలో సీపీఆర్ ఎలా చేయాలో అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, డిఎఒ ఏ.ధనలక్ష్మి చేతుల మీదుగా ధృవ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు పి.రంజిత్ కుమార్, డి.చంద్ర మౌళి, కె.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే జోగారావు

1,83,077 మందికి వైఎస్ఆర్ ఆసరా

రూ.94.33 కోట్ల చెక్కు అందజేత

ప్రజాశక్తి - పార్వతీపురం

వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం ద్వారా జిల్లాలో నాలుగు విడతల్లో 378.39 కోట్లు నిధులు విడుదల చేసినట్లు జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండ నుంచి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి స్వయం సహాయక పొదుపు సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా పథకం నాలుగో విడత నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత నిధులు విడుదల కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి కలెక్టరు స్వయం సహాయక సంఘాలకు రూ.94.33కోట్ల రూపాయల ఆసరా నిధులు చెక్కును అందజేశారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా నాలుగో విడత జిల్లాలో 16669 స్వయం సహాయక పొదుపు సంఘాలకు చెందిన 1,83,077 మంది సభ్యులు బ్యాంకు ఖాతాల్లో రూ.94.33కోట్లు సిఎం బటన్ నొక్కి నేరుగా జమచేసినట్లు తెలిపారు. ఈ పథకం కింద జిల్లాకు నాలుగు విడతల్లో రూ.378.39 కోట్లు నిధులు విడుదల చేశామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన భరోసాతో పొదుపు సంఘాలు ఆర్థికంగా పరిపుష్టం కావాలని, డబ్బులను పెట్టుబడిగా పెట్టి స్వయం ఉపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్ కుమార్, లబ్దిదారులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు చెందిన రుణాలను ముఖ్యమంత్రి నాలుగు విడతల్లో తిరిగి చెల్లించినందుకు ఆనందంగా ఉందని సంఘ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం తిరిగి చెల్లించిన డబ్బులతో తాము చేస్తున్న వ్యాపారాలను అభివృద్ధి చేసుకున్నామని, బ్యాంకులు ఎక్కువగా రుణాలు అందిస్తున్నాయని, వాటితో వ్యాపారం అభివృద్ధి చెంది ఆదాయం పెరిగిందని పట్టణానికి చెందిన గుంట్రెడ్డి లక్ష్మి, కర్రి ఉషారాణి, పైల సుమలత, తాటి లావణ్య, కొల్లి నాగమణి, అడ్డాపుశీలకు చెందిన సుర్ల కాంతమ్మ సంతోషం వ్యక్తం చేశారు.

డైరీ, కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎపి ప్రభుత్వ టైపిస్టులు, స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రచురించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను డిఆర్‌ఒ జె.వెంకటరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఎపి రాష్ట్ర ప్రభుత్వ టైపిస్టులు, స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సంఘం పూర్వపు శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పి.మణిప్రభాకర్, అదనపు కార్యదర్శి ఎ.ధర్మారావు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎపిజెఎసి జిల్లా అధ్యక్షులు, ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి.శ్రీరామమూర్తి (తహశీల్దారు), ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, కలెక్టరేట్ విభాగం అధ్యక్షులు ఆర్.ఉమామహేశ్వరరావు (తహశీల్దారు), ఎపి టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ల సంఘం, శ్రీకాకుళం డివిజన్, పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌ఛార్జి పి.మణిప్రభ, ఇతర నాయకులు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న డిఆర్‌ఒ వెంకటరావు

ప్రాణం తీసిన ఫొటో సరదా

పాచిపెంట : ఫొటో సరదా ఓ యువకుడి ప్రాణం బలిగొంది. మండలంలోని పారమ్మకొండపై నుంచి జారిపడి యువకుడు మృతి చెందిన మంగళవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాలూరు మండలం కూర్మరాజుపేటకు చెందిన అప్పికొండ మురళి (18), అతని మేనల్లుడు గణేష్ కలిసి మంగళవారం ఉదయం పాచిపెంట మండలంలోని పారమ్మ కొండపైకి ఎక్కి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మురళి తనతో పాటు తీసుకువచ్చిన సెల్‌ఫోన్ ద్వారా ఫోటోలు, వీడియోలు తీయాలని మేనల్లుడు గణేష్‌కు ఫోన్ ఇచ్చాడు. ఫోటో కోసం మురళి కొండ చివరికి వెళ్లి నిల్చొని ఉండగా ఇంతలో బిపి రావడంతో కళ్లు తిరిగి కాళ్లు జారి కొండపై నుండి కిందకు పడిపోయాడు. దీంతో తీవ్రగాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మురళి తండ్రి శంకరరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన మురళి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

జీవనోపాధిని మెరుగుపర్చుకోవాలి


ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలను సద్వినియోగం చేసుకుని డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు తమ జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పట్టణంలోని బొగ్గుల వీధిలో ప్రభుత్వం మంజూరు చేసిన పట్టణ ప్రతి యూనిట్ మిర్చి మసాలా యూనిట్‌ను ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధికి ఎన్నో పథకాలను ప్రవేశపెడుతుందని, వీటిని సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళా సంఘ సభ్యురాలు అభివృద్ధి చెందాలని అన్నారు. కార్యక్రమంలో మెప్మా ఎ.ఒ., సిఎంఎం కుమార్, సిఐలు చిట్టెమ్మ, పద్మ శశిభూషణ్, టిఎల్ఎఫ్ శ్రీదేవి, రిసోర్స్‌పర్సన్స్, ఒబిలు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధిపై వార్డు సభ్యులకు శిక్షణ

ప్రజాశక్తి - కురుపాం

2024-25 గ్రామపంచాయతీ వార్షిక ప్రణాళిక అభివృద్ధిపై వార్డు సభ్యులకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇఒపిఆర్‌డి జి.రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ కె. రామచంద్ర వార్డు సభ్యులకు వివిధ రకాల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులు వాటిద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం వార్షిక అభివృద్ధి ప్రణాళిక ఏ విధంగా రూపొందించుకోవాలో అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ పంచాయతీల వార్డుసభ్యులు పాల్గొన్నారు.



సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్‌బిఐ మేనేజర్

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్లపాడులో జనసేన నాయకులు వజ్రగడ జానీ నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

బలిజిపేట : పెదపెంకిలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు సమక్షంలో యువత, గ్రామపెద్దలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక ఎస్‌ఐబి మేనేజర్ కిరణ్ కుమార్ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత సుభాష్ చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశ సాధనకై కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ యువత, పెద్దలు పాల్గొన్నారు.

పాడిలో జెఎఎస్ శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని పాడిలో జగనన్న ఆరోగ్య సురక్ష (2.0) వైద్య శిబిరం రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వైద్య శిబిరానికి వచ్చిన 405మందికి డాక్టర్ శంకరరావు, డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ అభినవ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి బిపి, షుగర్, మలేరియా, టిబి, డెంగీ, రక్తహీనత పరీక్షలు నిర్వహించారు.ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే పాడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యవిద్యపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పౌష్టికాహారం, శారీరక, పరిశీలించి, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణ, లేబ్ టెక్నీషియన్ బి.రాము, వైద్య సిబ్బంది లక్ష్మి, అనితా, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

25న పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని పలు పంచాయతీల్లో నిర్మాణాలు పూర్తయిన గ్రామ సచివాలయాలను, రైతుభరోసా కేంద్రాల భవనాలను ఈనెల 25న కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి ప్రారంభించనున్నట్టు మండల ఇంజనీరింగ్ అధికారి గోపి గౌరీశంకర్రావు వెల్లడించారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లా డారు. మండల పరిధిలోని సంతోషపురంలో రైతుభరోసా కేంద్రం, గ్రామసచివాలయ భవనాలను ప్రారంభించనున్నారని తెలిపారు. ఉద్దవోలులో గ్రామ సచివాలయ భవనం రైతుభరోసా కేంద్రంతో పాటు వెల్నెస్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. అలాగే పెద్దూరులో రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభించనున్నారని జెఇ తెలిపారు.

పేదల కంటి చూపు మెరుగుకు జెఎఎస్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పేదల కంటి చూపును మెరుగుపర్చుకోవడానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అటువంటి వారికి కళ్లజోళ్లు అందించి శస్త్ర చికిత్సలు చేస్తున్నామని నేత్ర వైదాధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. మండలంలోని కృష్ణపల్లిలో నేత్ర వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దృష్టి దోషం వున్న వారికి ఉచితంగా కళ్ల జోళ్లు పంపిణీ చేస్తామని అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు కూడా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్ బాబు, నేత్ర వైద్య సహాయకులు ఉమా మాహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారునికి పౌష్టికాహారాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

పౌష్టికాహార సరుకులు అందజేత

ప్రజాశక్తి - కురుపాం

అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు వారి హక్కులపై సమ్మె చేసిన 42 రోజులుగా పౌష్టికాహారం అందకపోవడంతో బాలింతలు, గర్భిణీలు, పిల్లలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 43వ రోజు ప్రభుత్వంతో చర్చలు సఫలమవ్వడంతో మంగళవారం అంగన్వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులైన గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు పాలు, గుడ్లు, తదితర సామాగ్రి అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ అంగన్వాడీలు సమ్మె చేస్తున్న సమయంలో పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడ్డామని, నేడు కేంద్రాల్లో అంగన్వాడీ కార్యకర్తలు సరుకులు అందజేయడం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు.

ప్రమాదకరంగా విద్యార్థుల ప్రయాణం

రాత్రి 8 వరకు బస్సుల కోసం నిరీక్షణ
ఫుట్‌పాత్‌లపై నిలబడి రాకపోకలు

ప్రజాశక్తి కొమరాడ

విద్యార్థుల సౌకర్యాల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని గొప్పలు చెప్పడమే తప్ప క్షేత్ర స్థాయిలో అవి కార్యరూపం దాల్చడం లేదు. కనీసం విద్యార్థులకు సరిపడా బస్సులను కూడా కేటాయించకపోవడంతో అవస్థలు పడుతున్నారు. బస్సులు కోసం సాయంత్రం నుంచి రాత్రి 8గంటల వరకూ రోడ్లపై నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురవుతుందని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. చేసేది లేక చాలా మంది ప్రమాదకర ప్రయాణాలు చేయాల్సి వస్తుందని చెబుతున్నారు.

మండలంలోని కోటిపాం జిల్లా పరిషత్ హై స్కూల్ జిల్లాలోని అత్యధికంగా విద్యార్థులున్న పాఠశాలగా ప్రసిద్ధి గాంచిన విషయం తెలిసిందే. మండల నలుమూలల నుంచి ఈ పాఠశాలకు విద్యార్థులు అధిక సంఖ్యలో వస్తుంటారు. పాఠశాలకు విద్యార్థులు వచ్చేందుకు కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ప్రమాదకర ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది. పాఠశాలకు రావడానికి వచ్చిన తరువాత తిరిగి వెళ్లడానికి నానా తంటాలు పడుతున్నారు. సాయంత్రం 4.30గంటలకు పాఠశాల పూర్తయిన తర్వాత తిరిగి ఇళ్లకు వెళ్లేందుకు రాత్రి 8 గంటల వరకు ఆడపిల్లలు రోడ్డుపైనే బస్సులు కోసం నిరీక్షించాల్సి వస్తుంది. దీంతో పిల్లలు కోసం తల్లిదండ్రులు వేయి కళ్లతో ఇళ్ల వద్ద ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించింది. వయసుకు వచ్చిన ఆడపిల్లలు రోడ్డుపై రాత్రిపూట బస్సులు కోసం నిరీక్షణ చేయడంపై తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు రోడ్డుపై బస్సులు కోసం నిరీక్షిస్తున్న ఆడపిల్లలను ఆకతాయిలు ఇబ్బందులు పెడుతున్నా కనీసం పాఠశాల ఉపాధ్యాయులు గాని, అధికారులు కాని మహిళా పోలీస్ కాని పట్టించుకునే పరిస్థితి లేదని పదో తరగతి విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరిపడా బస్సులు లేకపోవడంతో బస్సు వచ్చిన వెంటనే విద్యార్థులంతా ఒకేసారి ఎక్కడంతో తోపులాట జరుగుతోంది. ఫలితంగా చాలా మంది విద్యార్థులు కిందపడి గాయాలపాలవుతున్నారు. మరి కొంత మంది విద్యార్థులు బస్సులో కూర్చోవడానికి సీట్లు లేక బయట గేటు వద్ద వేలాడుతూ ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థులకు సరిపడా బస్సులు కేటాయించాలని విద్యార్థులు కోరుతున్నారు.



ఫుట్‌పాత్‌పై ప్రయాణిస్తున్న విద్యార్థులు



విధులను బహిష్కరించిన న్యాయవాదులు

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురం (గరుగుబిల్లి)

పార్వతీపురం బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు మంగళవారం తమ విధులను బహిష్కరించి జిఒ నెంబర్ 27 రద్దు చేయాలని ధర్నా చేశారు. దీనికి నిరసనగా కోర్టులో జరిగే వ్యవహారాలకు హాజరు కాలేమని ఫిబ్రవరి 7వ తేదీ వరకు విధులను బహిష్కరిస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు వ్యతిరేకంగా తమ విధులను బహిష్కరిస్తున్నట్లు పార్వతీపురం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనేది ముమ్మాటికీ మంచిది కాదని, స్టేట్ బార్ కౌన్సిల్ వారు మాఫ్సల్ కోర్టులను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలని చెప్పారు. భూమి వ్యవహారాలకు సంబంధించి ఇప్పటికే రెవెన్యూ వ్యవస్థ అనేకమైన లోప భూయిష్టి విధానాలను అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కే. కుర్మినాయుడు, సీనియర్ అడ్వకేట్స్ టి. జోగారావు, అద్దేపల్లి నారాయణరాజు, జాగాన మధుసూదన్‌రావు, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ప్రసన్నకుమార్

ఫిబ్రవరిలో టిడ్కో ఇళ్ల పంపిణీ

యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి : చైర్మన్ జమ్మాన

ప్రజాశక్తి- సాలూరు

ఫిబ్రవరి మొదటి వారంలో టిడ్కో ఇళ్ళ లబ్దిదారులకు ఇళ్ళు పంపిణీ చేయనున్నట్లు టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ చెప్పారు. మంగళవారం ఆయన పట్టణానికి సంబంధించిన టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించారు. జరుగుతున్న మౌలిక సదుపాయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న సివరేజ్ ప్లాంట్, సిసి రోడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లోగా పనులు పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టరులను ఆదేశించారు. రాష్ట్రంలో 35 పట్టణాల్లో 90వేల మందికి టిడ్కో ఇళ్ళ ను పంపిణీ చేసినట్లు తెలిపారు. విజయనగరం సమీపంలో ఉన్న సారిపల్లి సానియా నగర్, సాలూరు పట్టణంలో నిర్మాణమైన ఇళ్ళను అందజేయనున్నట్లు చెప్పారు. వేగావతి నది నుంచి తొమ్మిది లక్షల నీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పటికే నదిలో ఇన్ ఫిల్ట్రేషన్ భావులు, గ్యాలరీల నిర్మాణం పూర్తయిందన్నారు. 24 గంటల నీటి సరఫరా, విద్యుత్ సరఫరాకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పదిరోజుల్లో విద్యుదీకరణ పనులు పూర్తి చేస్తామని ఎపిఇపిడిసిఎల్ అధికారులు చెప్పారని తెలిపారు. డిప్యూటీ సిఎం రాజన్నదొరతో పాటు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలం సురేష్‌లతో టిడ్కో ఇళ్ళ లబ్దిదారులకు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆయన వెంట టిడ్కో ఇఇ జ్యోతి, మున్సిపల్ కమిషనర్ టి.జయరాం వున్నారు.

ఎంపిడిఒ కార్యాలయాన్ని సందర్శించిన సిఇఒ

ప్రజాశక్తి - పాచిపెంట

వార్షిక తనిఖీల్లో భాగంగా ఉమ్మడి జిల్లాల జెడ్పీ ఇన్‌ఛార్జి సిఇఒ కె.రాజ్‌కుమార్ స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. దస్త్రాలు పరిశీలించిన అనంతరం అధికారులతో సమీక్షించారు. 15వ ఆర్థిక ప్రణాళిక నిధులు సకాలంలో ఖర్చు చేయాలని సూచించారు.

ఘనంగా లోకేష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - కురుపాం

తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన్నాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేశ్ చంద్ర దేవ్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, మాజీ ఎంపి వైరిచర్ల చంద్ర ప్రదీప్‌దేవ్ హాజరై కేక్ కటింగ్ పేదలకు చీరలు, స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు, బాలింతలకు, రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పరిపాలనతో ప్రజలు విసిగి చెందారని రానున్న ఎన్నికల్లో కచ్చితంగా తెలుగుదేశం పార్టీని గెలిపించడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య, అరుకు పార్లమెంట్ బిసి సెల్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, అరుకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని కీసరజోడులో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను టిడిపి నేత పడాల భూదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సవర కుంపి, సీనియర్ నాయకులు సవర మంగయ్య, పువ్వల కైలాష్, ఆరిక మురళి, ఆరిక రామయ్య, బిడ్డిక ప్రసాద్, ఆరిక చందు, నిమ్మక సత్యం, ఉర్లక సుగ్రీవులు, కద్రక వరలక్ష్మి, బిడ్డిక వరహాలమ్మ, ఊయక కనకమ్మ, తోయిక సావిత్రమ్మ, ఆరిక నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు మంగళవారం స్థానిక నక్కలపేట సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా వచ్చిన అభిమానుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ నిమ్మక జయకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, మాజీ కోఆప్షన్ సభ్యులు సుంకరి అనిల్‌దత్, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా గుమ్మలక్ష్మీపురంలో కురుపాం నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ప్రభుత్వ హాస్పిటల్లో రోగులకు రొట్టెలు, పళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పాడి సుదర్శన్ రావు, నియోజకవర్గ మహిళా కార్యవర్గ కార్యదర్శి వెంకట భారతి, తాడంగి రామారావు, పోలూరు శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ వెంకట్రావు, దాసు, నాయకులు కోటేశ్వరరావు, ధర్మారావు, నాగవేణి, మాసయ్య, ధర్మారావు తిరుపతిరావు, యువరాజు, గౌరీ శంకర్, రవి, జానకి, చిన్నా, శరత్ పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మ ఎల్విన్ పేటలో కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక కొండలరావు, నాగేశ్వరరావు

పార్వతీపురం రూరల్: లోకేష్ జన్మదిన వేడుకలు మంగళవారం పార్వతీపురం టిడిపి నాయకులు వేరువేరు చోట్ల ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ టిడిపి కార్యాలయంలో నిర్వహించిన వేడుకలలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ డి శ్రీదేవి కేకు కట్ చేసి నాయకులకు శ్రేణులకు తినిపించారు. బైపాస్ రోడ్ లో ఉన్న టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో ఇన్చార్జి బోనాల విజయ్ చంద్ర ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. జిల్లా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు కౌన్సిలర్లు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



మాజీ మంత్రి శత్రుచర్లకు కేక్‌ను తినిపిస్తున్న వీరేష్‌చంద్రదేవ్



గుమ్మలక్ష్మీపురం : రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న జగదీశ్వరి



కీసరగూడలో చిన్నారితో కేక్ కట్ చేయిస్తున్న భూదేవి

తేజోవతి ఫ్లెక్సీలు చించివేత

సంధ్యారాణిపై హైకమాండ్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - సాలూరు

శంబర పోలమాంబ జాతర సందర్భంగా నియోజకవర్గ టిడిపి టిక్కెట్ ఆశిస్తున్న ఎం.తేజోవతి పలుచోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేయడం వివాదాస్పద మవుతోంది. వెంకటేశ్వరా డీలక్స్ సెంటర్, వేగావతి వంతెన సమీపాన, మామిడిపల్లిలో టిడిపి నాయకులు తేజోవతి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటిని చించివేయడం వెనుక నియోజకవర్గ ఇంచార్జి సంధ్యారాణి అనుచరుల హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు తేజోవతి ఫ్లెక్సీలు చించివేతపై పార్టీ అధినాయకత్వానికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు భంజ్ దేవ్ ఆశీస్సులతో తేజోవతి ఎమ్మెల్యే సీటు ఆశిస్తున్నారు. ఈ మేరకు ఆమె టీచర్ ఉద్యోగానికి రాజీనామా కూడా చేశారు. అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. గత కొద్దిరోజులుగా పార్టీలో జరుగుతున్న పరిణామాలను జీర్ణించుకోలేక సంధ్యారాణి అనుచరులు తేజోవతి ఫ్లెక్సీలను చించివేశారనే ప్రచారం జరుగుతోంది.



తేజోవతి ఫొటోను చించివేసిన అంగతకులు

తప్పిపోయిన పిల్లలు తల్లిదండ్రుల చెంతకు..

ప్రజాశక్తి - మక్కువ

శంబర పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా కుటుంబ సభ్యుల నుంచి తప్పిపోయిన పిల్లలను పోలీసులు కొన్ని గంటల్లోనే వారి తల్లిదండ్రులకు చేరవేశారు. మంగళవారం జరిగిన జాతరలో సుమారు ఐదుగురు పిల్లలు తమ కుటుంబ సభ్యుల నుంచి తప్పిపోవడాని తమ సిబ్బంది గుర్తించి వెంటనే సోషల్ మీడియా ద్వారా వారి తల్లిదండ్రులకు చేర్చవేసినట్టు ఎస్ఐ పి. నరసింహమూర్తి తెలిపారు ఈ మేరకు తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు

గ్రామాలాభివృద్ధికి ప్రణాళిక సిద్ధం

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ ఉద్యోగులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. వచ్చే ఆర్థిక వనరులను బట్టి అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం. బాబ్జి, ఎంపిపి బి. రమణమ్మ, శ్రీరాములు నాయుడు, వివిధ గ్రామాల వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రసాద్

ప్రకృతి సాగుతో రైతుల మేలు

ప్రజాశక్తి - కురుపాం

ప్రకృతి వ్యవసాయం సాగు చేయడం వల్ల రైతులకు లాభదాయకంగా ఉంటుందని జిల్లా ప్రకృతి వ్యవసాయం అసోసియేట్ జి.అన్నపూర్ణ అన్నారు. మంగళవారం జియ్యమ్మవలస మండలంలోని కన్నపుదొరవలసలో జొన్న పంట వేసే రైతులకు సామూహిక అగ్నాస్త్ర కషాయం తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడుతూ జొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు ఈ కషాయం తయారు చేసుకొని వాడుకోవడం వల్ల జొన్నపంటలో ఖర్చు తగ్గించు కొంటే దిగుబడులు పెరుగుతాయన్నారు. ఈ కషాయానికి కావాల్సిన పదార్థాలు ఎకరాకు 10కేజీల వేపాకు, 10లీటర్ల ఆవుమూత్రం, కేజీ పచ్చి మిరప కాయలు, 1/2కేజీ వెల్లుల్లి, 1/2 కేజీ పొగాకు, అన్ని వేరు వేరుగా రుబ్బి, ఆవు మూత్రంలో కలిపి మరగబెట్టి, 3సార్లు పొంగు వచ్చేవరకు మరగనివ్వాలి. ఆ తర్వాత జొన్న పంటలో 25రోజులు పంట కాలంలో ట్యాంకునీటిలో 1/4లీటరు కషాయం కలిపి పిచికారీ చేసుకొని, 50నుంచి 60 రోజుల కాలంలో ట్యాంకు నీటిలో అరలీటరు కషాయం కలిపి పిచికారీ చేసుకుంటే కత్తెర పురుగు నివారణ జరుగుతుందని సూచించారు. ప్రతి రైతు ఇలా చేసుకోవడం వల్ల జీవన ఆర్థిక స్థితిగతులను మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వై.కృష్ణ, ఎం.మోహన దాస్, రైతులు అప్పలనాయుడు, స్వామి నాయుడు, సన్యాసి నాయుడు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే బిసిల అభివృద్ధి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

తెలుగుదేశం పార్టీతోనే బిసిలు అభివృద్ధి చెందారని, రానున్న ఎన్నికల్లో బిసిలంతా టిడిపికి అండగా ఉండాలని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు పిలుపునిచ్చారు. మండలంలోని రావివలసలో జయహో బిసి సదస్సు కోట సుమన్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయరామరాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతోనే బిసిలకు అండదండ అని ఉంటాయని ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలోనే బిసిలకు నిజమైన న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వీరేస్ చంద్రదేవ్, తవిటినాయుడు, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర జిల్లా స్థాయి నాయకులు గ్రామప్రజలు కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

గ్రామాల్లో వికసిత్ భారత్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పాపం వలస, ఇప్పలవలస గ్రామాలలో మంగళవారం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం ఏర్పాట చేశారు. జిల్లా మలేరియా అధికారి జగన్ మోహన్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు ఎం గౌడ్ నాయుడు, కే సింహాచలం, పంచాయతీ కార్యదర్శులు, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



యాప్ పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్న సిబ్బంది

కులగణనకు కుస్తీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కులగణన సర్వే ప్రారంభించింది. అయితే అందుకు తగ్గ యాప్ సక్రమంగా పనిచేయకపోవడంతో సిబ్బంది కుస్తీలు పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో గ్రామ వాలంటీర్లు, విఆర్ఒలు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి కులగణన సర్వే చేపడుతున్నారు. సర్వరు సక్రమంగా డౌన్‌లోడ్ అవ్వకపోవడంతో సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఇందులో భాగంగా గృహ యజమాని వివరాలు, కుటుంబ సభ్యులు వివరాలు పొందుపర్చాల్సి ఉంది.

కంబరవలసలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరవలస గ్రామంలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ వివిధ రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.